సాక్షి

# మంగోలియన్ మెట్రో రైల్‌కు హెచ్‌ఎంఆర్ మార్గనిర్దేశం

- నగరాన్ని సందర్శించిన మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధులు
- పీపీపీ పద్ధతిలో మెట్రో నిర్మాణానికి చట్టపరమైన, సాంకేతిక సహకారం
- హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి...



సాక్షి, సిటీబ్యూరో: మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధుల బృందం గురువారం నగరాన్ని సందర్శించింది. మంగోలియా రాజధాని ఉలాన్ బాటర్‌లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించతలపెట్టిన మెట్రో రైల్ ప్రాజెక్టుపై అధ్యయనం కోసం వారు హైదరాబాద్‌కు వచ్చారు. మంగోలియా ప్రభుత్వ కేబినెట్ సెక్రెటేరియట్ పురేవ్‌సురన్ సరంగేరల్ నేతృత్వంలో వివిధ విభాగాలకు చెందిన 20 మంది అధికారులు నగరాన్ని సందర్శించారు. మొదట ఖైరతాబాద్‌లోని ఆస్కీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మంగోలియన్ అధికారుల బృందంతో సమావేశమయ్యారు. పీపీపీ పద్ధతిలో నిర్మించిన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాజెక్ట్ అని చెప్పారు. మెట్రోరైల్ నిర్మాణంలో ఎదురయ్యే చట్టపరమైన, సాంకేతికపరమైన సమస్యలపైన వారికి వివరించారు. వివిధ దశల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపైన ఎన్వీఎస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు అంశాలపైన మంగోలియా అధికారులు వ్యక్తం చేసిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం తాము పీపీపీ పద్ధతిలో చేపట్టాలని భావిస్తున్న మెట్రో రైల్ నిర్మాణానికి చక్కటి గైడెన్స్ లభించాయని మంగోలియన్ ప్రభుత్వ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే మంగోలియన్ ప్రభుత్వం నిర్మించనున్న మెట్రో రైల్ ప్రాజెక్టుకు మార్గదర్శనం చేయనున్నట్లు ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆస్కీ సీనియర్ అధికారులు ప్రొఫెసర్ సుబోధ్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

12/04/2024 | Hyderabad (Hyderabad) | Page : 10
Source : https://epaper.sakshi.com/